# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- వర్షా కాలంలో దోమల నిర్మూలన తప్పనిసరి
- వార్డుల్లో ఫ్రైడే–డ్రైడేపై అవగాహన కార్యక్రమాలు



75వ వార్డులో డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీభాయ్, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్

**అగనంపూడి:** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 85వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య అన్నారు. వార్డులోని కొండయ్యవలసలో శుక్రవారం సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలపై అవగాహన ఉంటే వ్యాధులు దూరంమవుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, బండారు చందు రమేష్, వద్దాది శ్రీను, పైడిరత్నం, దొక్కా రమేష్, కోసూరి తాతారావు, బెండి రామకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

**డెంగ్యూపై అవగాహన**

**ఉక్కునగరం:** డెంగ్యూ జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా విభాగం సీనియర్ ఎంటొమాలజిస్ట్ వరహాల దొర అన్నారు. డెంగీ మాసోత్సవాల సందర్భంగా జిల్లా మలేరియా అధికారి తులసి ఆదేశాల మేరకు శుక్రవారం స్టీల్‌ప్లాంట్ రైతుబజార్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టైర్లు, కొబ్బరి బొండాలు, ఫ్రిడ్జ్ బ్యాక్‌సైడ్ బాక్స్, టీ గ్లాసెస్, ఐస్‌క్రీం కప్స్, రుబ్బురోలు, సిమెంట్ కుండీ, ప్లాస్టిక్ టాప్స్, మనీప్లాంట్స్ తదితర వాటి వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రతీ ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్‌కుమార్, దేముడు నాయుడు, స్టాఫ్ చంద్రశేఖర్, చలపతిరావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

**డ్రైడే విధిగా పాటించాలి**

**పెదగంట్యాడ:** వారంలో ప్రతి శుక్రవారం ప్రజలు విధిగా డ్రైడే పాటించాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీభాయ్ అన్నారు. వార్డులోని నెల్లిముక్కులో శుక్రవారం డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, డ్రమ్ములు, కుండీలపై మూతలు ఉంచాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయవద్దని కోరారు. దీనివల్ల దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాప్తి చేసే ప్రమాదముందని హెచ్చరించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు తడి–పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని కోరారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, కోన చిన అప్పారావు, కిలాన ముసలయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



85వ వార్డు కొండయ్యవలసలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య



స్టీల్‌ప్లాంట్ రైతుబజార్‌లో డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

## క్లుప్తంగా

### ఘనంగా విద్యార్థి కౌన్సిల్ పట్టాభిషేకం



విద్యార్థి కౌన్సిల్ ప్రతినిధులతో ఎన్‌సీసీ బెటాలియన్ ఆఫీసర్, ప్రిన్సిపాల్

**ఉక్కునగరం:** స్థానిక డీ పాల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థి కౌన్సిల్ పట్టాభిషేకం ఘనంగా జరిగింది. ఎన్‌సీసీ బెటాలియన్–2 ఆఫీసర్ ఇన్‌చార్జి ఆఫ్ ట్రెనింగ్ శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై 2024–25కు కొత్తగా ఎన్నికైన పాఠశాల నాయకులకు బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ అనీష్ మాథ్యూ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచి నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. తద్వారా దేశానికి మంచి నాయకత్వం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### జోరుగా మోడ్రన్ లైట్ల ఏర్పాటు పనులు



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

**అక్కిరెడ్డిపాలెం:** జీవీఎంసీ 69వ వార్డు కృష్ణ మహంతి చెరువు వాకింగ్ ట్రాక్ పక్కన మోడ్రన్ లైట్లు మంజూరవ్వడంతో వాటి ఏర్పాట్ల పనులు జోరుగా జరుగుతున్నాయి. శుక్రవారం పనులను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పరిశీలించారు. నాతయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, శీలానగర్ నుంచి పలువురు పెద్ద సంఖ్యలో వాకింగ్‌కు వస్తుండటంతోపాటు సాయంత్రం చెరువు గట్టున సుందరీకరణ పనులు, మోడ్రన్ లైట్ల ఏర్పాటును వేగవంతంగా చేపడుతున్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

### వెంకన్నకు పంచామృతాభిషేకం



వెంకన్నకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

**పెందుర్తి:** వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

### అయ్యప్పకు అభిషేకాలు

**పెందుర్తి:** సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆయలంలో ఉత్తర నక్షత్రం సందర్భంగా శుక్రవారం పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం రేపు

**సింహాచలం:** నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో అడవివరంలో ఆదివారం మహా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఆర్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందని తెలిపారు. రోటరీబ్లడ్ సెంటర్, వందే భారత్ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో యువకులు పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

# నిస్వార్థ సేవ.. దైవ సేవతో సమానం



అరుణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

**గాజువాక:** నిస్వార్థ సేవలను అందించడమే సత్యసాయి సమితి ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని, అదే దైవ సేవతో సమానమని రాయ్‌పూర్ అమిటీ యూనివర్సిటీ డైరెక్టర్, ఆధ్యాత్మికవేత్త శివమ్ అరుణ్‌కుమార్ పట్నాయక్ అన్నారు. గొంతినవానిపాలెంలోని సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సేవ చేయడంలో ఉన్న ఆనందం మరెక్కడా లభించదన్నారు. సేవ చేయడం వల్ల ఇబ్బందుల్లో ఉన్న వారు ఆనందంగా ఉంటారన్నారు. మానవులు స్వార్థం విడనాడి సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. గొంతినవానిపాలెం భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో ఆదివారం మెంటర్ ఆస్పత్రిలో సేవగా 300 మందికి, ప్రతి సోమవారం కోరమాండల్ దరి జీవీఎంసీ ఆస్పత్రి వద్ద 600 మందికి ఆహారం అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ ఎస్.ఆదిరెడ్డి, ప్రతినిధులు రామారావు, జ్యోతి, నరవ శ్రీనివాస్, పద్మరాజు, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

### నేడు శ్రీతిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి వెంకయ్యనాయుడు

**అక్కిరెడ్డిపాలెం:** మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శీలానగర్‌లోని ఎస్‌బీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి శనివారం ఉదయం 6 గంటలకు విచ్చేయనున్నట్లు దివ్యక్షేత్రం ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని దివ్యక్షేత్రం ప్రతినిధులు తెలిపారు. వెంకయ్యనాయుడుకు ఎస్‌బీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ స్వాగతం పలకనున్నట్లు తెలిపారు.

# గురుశిష్యుల సంబంధాలను బలపర్చుకోవాలి




ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

**గాజువాక:** అధ్యాపక వృత్తిని ఎన్నుకునేవారు గురుశిష్యుల సంబంధాలను బలపర్చుకోవాల్సిన అవసరం ఉందని దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాల, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మూడు రోజుల ఫ్యాకల్టీ ఓరియేంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిష్యులతో మంచి సంబంధాలను కలిగి ఉంటేనే గురువుల పరంపర కొనసాగుతుందన్నారు. అధ్యాపకులు తమ సిలబస్‌పై ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. రాయలసీమ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ప్రొఫెసర్ వై.నర్సింహులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, వివిధ విద్యా సంస్థల అధిపతులు, అధ్యాపకులు టి.బలరామకృష్ణ, ఎ.వి.ఎల్.జగన్నాథం, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పలు రైళ్ల రీషెడ్యూల్

**తాటిచెట్లపాలెం:** పలు రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతో.. ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరే రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు బయలుదేరింది.

### వివాహిత అదృశ్యం



ఎస్.భవాని

**అల్లిపురం:** తన భార్య కనిపించడం లేదని అల్లిపురం, గాం, దీబొమ్మ జంక్షన్‌కు చెందిన ఎస్.సురేష్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. గత ఏడాది డిసెంబర్ 24న సురేష్ పనికి వెళ్లారు. రాత్రి ఇంటికి చేరుకోగా అతని భార్య ఎస్.భవాని కనిపించలేదు. ఆమె సెల్‌ఫోన్ ఇంట్లోనే ఉంది. అప్పటి నుంచి నగరం, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 92941 06386, 9440 904716కు తెలియజేయాలని సీఐ కోరారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి




రైల్వేస్టేషన్ వద్ద ర్యాలీలో పాల్గొన్న శ్రామిక్ నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు

**తాటిచెట్లపాలెం:** ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్) పిలుపు మేరకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ జరిగింది. విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, యూనియన్ నాయకులు హాజరై.. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ కో–ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు మాట్లాడుతూ ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ నాయకులు శివగోపాల్ మిశ్రా నాయకత్వంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె.పట్నాయక్ నాయకత్వంలో రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. పోరాటాల ఫలితంగా పాత పెన్షన్ విధానాన్ని త్వరలోనే పునరుద్ధరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐఆర్ఎఫ్ జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల కార్మికులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దిగిరాకుంటే 1972లో చేసిన విధంగా సమ్మె చేసేందుకు సిద్ధమన్నారు. ర్యాలీ అనంతరం ప్రధాని మోదీకి రాసిన వినతిపత్రాన్ని వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు అందజేసి.. ప్రధానికి పంపాలని కోరారు. జోనల్ అధ్యక్షుడు పి.వి.జి.రాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### స్వాప్ డయేరియాపై అవగాహన ఉండాలి

**మహారాణిపేట:** డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యటించారు. ఇసుకతోట రామాలయం వీధి పరిసర ప్రాంతాల్లో పర్యటించి పలు సూచనలు చేశారు. స్టాప్ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు డీఎంహెచ్‌వో సూచించారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



గంధ్రేడి నూకరాజు (ఫైల్)

**భోగాపురం:** విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేట సమీపంలో శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీ కొనడంతో డ్రైవర్ గంధ్రేడి నూరాజు(36) మృతి చెందగా, క్లీనర్ ఏనుగుల రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాపట్నం జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన నూకరాజు డ్రైవర్‌గా, అసరపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల రాము క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ లారీలో బిస్కెట్ ప్యాకెట్లను లోడు చేసుకుని సబ్బవరం నుంచి ఒడిశా బయలుదేరారు. సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి అప్పటికే టైర్ పగిలి రహదారిపై నిలిచిపోయిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. భోగాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నూకరాజు మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, తీవ్ర గాయాల పాలైన రామును విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు గంధ్రేడి వెంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

# గోశాలలో ఘనంగా వన మహోత్సవం



వనమహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శుక్రవారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సంపెంగ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం దేవస్థానం అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మొక్కలను పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దేవస్థానం గోశాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు సంరక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రాజేంద్రకుమార్, నరసింహరాజు, ఏఈ హరిరాజు, సూపరింటెండెంట్లు యనమండ్ర అప్పారావు, గాయత్రి పాల్గొన్నారు.

# పరశురామావతారంలో జగన్నాథుడు



పరశురామావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి

**అగనంపూడి:** జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని జగన్నాథస్వామి ఆలయ సారథ్యంలో నిర్వహిస్తున్న రథోత్సవాల్లో భాగంగా శుక్రవారం జగన్నాథ స్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దశావతారాల్లో భాగంగా ఇంద్రద్యుమ్నుహాల వద్ద వేంచేసియున్న సుభద్ర, బలభద్రుని సమేత జగన్నాథస్వామి పరశురామావతారంలో ఆలయ ప్రధాన అర్చకులు గురు సంతోష్ అలంకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు, అగనంపూడి, పరిసర నిర్వాసిత కాలనీలు, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, ఫార్మాసిటీ కాలనీ, లంకెలపాలెం పరిసర గ్రామాల నుంచి భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బొర్రమాంబ, మరిడిమాంబ పారాయణ సేవా సమితిలు లలిత, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, మామిడి నాగేశ్వరరావు, గళ్ల సాయికుమార్, నారపిని నాగమణి, కుసుమంచి కుమారి, వరదారాణి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌పీసీఎల్ అధికారి డి.టి.రాజు, హెచ్‌ఎం కాంతం

**అక్కిరెడ్డిపాలెం:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ములగాడ హెచ్‌పీసీఎల్ మిలీనియం ప్లస్ సీవోఎంసీవో అధికారి డి.టి.రాజు అన్నారు. హెచ్‌పీసీఎల్ మిలీనియం ప్లస్ ఆధ్వర్యంలో శుక్రవారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై హెచ్‌పీసీఎల్ అధికారి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు రవిచంద్, కుమారస్వామి, దేముళ్లు, మాధురి, వేణు, సంస్థ ప్రతినిధులు ఎ.రవికుమార్, ఎస్.హరీష్, పి.రాజారావు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

**అక్కిరెడ్డిపాలెం:** శీలానగర్ 11 కేవీ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు శీలానగర్, గవర జగ్గయ్యపాలెం, హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, కిమ్స్ ఐకాన్ హాస్పిటల్, పోర్టు రోడ్డు ఏరియా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

**నాలుగు ఫీడర్ల పరిధిలో..**

**పెదగంట్యాడ:** మదీనాబాగ్ 11 కేవీ ఫీడర్, పాలవలస 11 కేవీ ఫీడర్, పిట్టవానిపాలెం 11 కేవీ ఫీడర్, ఏఎంటీజెడ్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని జోన్–2 ఈఈ బీకే నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మదీనాబాగ్ ఫీడర్ పరిధిలోని మదీనాబాగ్, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, పాలవలస ఫీడర్ పరిధిలోని మద్దివానిపాలెం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, దేవాడ, అప్పికొండ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, మురుభాయ్, పాలవలస, గొల్లపేట, ఈసరపువానిపాలెం, యలమంచిలి దొడ్డి, గిన్నెవానిపాలెం, నక్కదొడ్డి, పిట్టవానిపాలెం ఫీడర్ పరిధిలో పిట్టవానిపాలెం, కేఎస్ పాలెం, పెదపాలెం, చినపాలెం, ఆశ్రిత్‌నగర్, ఏఎంటీజెడ్ ఫీడర్ పరిధిలో ఏఎంటీజెడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**కర్ణవానిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో..**

**గాజువాక:** కర్ణవానిపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య కాలనీ, స్వతంత్రనగర్, జీవీఎంసీ వాటర్ వర్క్స్ ఫీడర్లకు శనివారం మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సుందరయ్య కాలనీ, అఫీషియల్ కాలనీ, శ్రీనగర్, దిబ్బపాలెం కాలనీ, కృష్ణదేవరాయ నగర్, పాత కర్ణవానిపాలెం, స్వతంత్రనగర్, పోర్టు వై.జంక్షన్, సర్దార్ నెస్ట్ ఏరియా, కేబీఆర్ పంప్ హౌస్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

# అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



గరుడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు




నిత్యకల్యాణంలో కంకణ ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. తదుపరి సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తరం పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

# కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

**డాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు సహస్ర తులసీదళార్చన..**

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.